క్లుప్తంగా

సమావేశం వాయిదా

రాయదుర్గం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో శాంతిసరోవర్‌లో నిర్వహించతలపెట్టిన సమావేశం వాయిదా వేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈనెల శుక్రవారం 'సక్సెస్ మంత్రా' పేరిట యూత్ మోటివేషన్ కార్యక్రమాన్ని వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు వారు పేర్కొన్నారు.

ఎంఎస్ థీసిస్ అవార్డు గ్రహీతలు వీరే..

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో విజయ్‌కుమారిశర్మ, రితేష్‌కుమార్ తివారీ ఎంఎస్ థీసిస్ అవార్డు గ్రహీతలను గురువారం ప్రకటించారు. 2021, 2022 సంవత్సరాలకుగానూ ట్రిపుల్‌ఐటీలోని రోబోటిక్స్ రీసెర్చ్ సెంటర్(ఆర్ఆర్‌సి), సెంటర్ ఫర్ కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్(సీసీఎన్ఎస్‌బీ) వారు అవార్డులను గెలుచుకోవడం విశేషం. ఇనిస్టిట్యూట్‌లో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు సహాయం అందించేందుకు ఈ అవార్డును అందించడం జరుగుతోంది. 2021 సంవత్సరానికి కర్తిక్‌రామ్, 2022కు ఉత్కర్ష్ ఆజాద్‌లను అవార్డులకు ఎంపిక చేశారు. వారిని పలువురు అభినందించారు.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 11 మందికి కొవిడ్ ర్యాపిడ్ యాంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు.

బీజేపీ నాయకుల హౌస్ అరెస్ట్



రాధాకృష్ణయాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

మాదాపూర్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు డబుల్ ఇళ్లపై బీజేపీ పోరుబాట కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరుతున్న మాదాపూర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గంగల రాధాకృష్ణయాదవ్‌ను గురువారం హౌస్ అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకలను పోలీసులు కేసులుపెట్టి భయపెడుతున్నారన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: బాటసింగారం వెళ్లకుండా పటాన్‌చెరు బీజేపీ శ్రేణులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, పట్టణ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ మాట్లాడుతూ.. బాటసింగారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిశీలనకు వెళుతున్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్‌లను అక్రమ అరెస్టులు చేయడం దారుణం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.ప్రజా సమస్యల పై పోరాటం చేస్తున్న బీజేపీ శ్రేణులను అక్రమ అరెస్టుల పేరుతో ఆపలేరని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు అంగడి బాలరాజు, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు ఆదిత్య, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా ట్రాఫిక్ జామ్

గచ్చిబౌలి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. గచ్చిబౌలిలోని బయోడైవర్సిటీ పార్కు కూడలి నుంచి మైండ్‌స్పేస్ కూడలి మీదుగా మాదాపూర్ వరకు.. ఐకియా రోడ్డులోనూ వాహనాలు బారులుతీరాయి.అలాగే బయోడైవర్సిటీ పార్కు కూడలి నుంచి మైండ్‌స్పేస్ మీదుగా మాదాపూర్ వరకు బారులుతీరాయి.

ముంపు ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన



వర్షపునీటిని తొలగింపజేస్తున్న కార్పొరేటర్ మంజుల, జీహెచ్‌ఎంసీ అధికారులు

హఫీజ్‌పేట్ : గత మూడురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చందానగర్ డివిజన్ పరిధిలో లోతట్టు ప్రాంతాలలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పర్యటించారు. చందానగర్, వేమన వీకర్ సెక్షన్, ఇంద్రానగర్, కెఎస్సార్ ఎన్‌క్లేవ్, దీప్తిశ్రీనగర్ లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలన్నారు.

ఎడతెరిపి లేని వాన..

రోడ్లు జలమయం



లింగంపల్లి అండర్ బ్రిడ్జి కింద భారీగా చేరిన వరద నీరు

- లోతట్టు ప్రాంతంలోని ఇళ్లలోకి వర్షపు నీరు
- లింగంపల్లి అండర్‌బ్రిడ్జి కింద భారీగా వరదనీరు
- వాహనాల రాకపోకలు మళ్లింపు



వర్షంలో విధులు నిర్వహిస్తున్న సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు



చందానగర్ డివిజన్ శాంతినగర్‌లో ఇళ్లలోకి వచ్చిన వరదనీరు



దీప్తిశ్రీనగర్ కాలనీలో జలమయమైన రోడ్డు

శేరిలింగంపల్లి జోన్ బృందం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనం ఇక్కట్ల పాలయ్యారు. బుధవారం రాత్రి నుంచి ఆగకుండా వర్షం కురుస్తుండడంతో రోడ్లు జలమయమయ్యాయి. శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో జోరుగా వర్షం కురుస్తూనే ఉంది. గత మూడు రోజులుగా వర్షం కురుస్తుండడంతో జీహెచ్‌ఎంసీ అధికార యంత్రాంగం, సిబ్బంది, డీఆర్‌ఎఫ్ బృందం, ట్రాఫిక్, సివిల్ పోలీసులు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టడంతో చాలా వరకు సమస్యలు తగ్గిపోయాయి.

- లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద వరదనీటిలో కారు ఇరుక్కుపోయింది. విషయం తెలుసుకున్న డీఆర్‌ఎఫ్ బృందం, జీహెచ్‌ఎంసీ అధికారులు అక్కడి చేరుకొని దాన్ని రోడ్డుపైకి తీసుకొచ్చారు.
- గంగారం, ఇంజనీరింగ్ ఎన్‌క్లేవ్, దీప్తిశ్రీనగర్‌కాలనీ, మియాపూర్ ఆల్విన్‌కాలనీ, మాదాపూర్‌లోని నెక్టర్‌గార్డెన్, పర్వత్‌నగర్, ఎస్‌బీఐ కాలనీలలో రోడ్లపైకి వరదనీరు చేరింది. వైశాలి నగర్ అండర్ బ్రిడ్జి, మంజీరారోడ్డు నుంచి బొటానికల్ గార్డెన్ రోడ్డులో వరదనీటితో ఇబ్బందులు ఎదురయ్యాయి.
- చందానగర్‌లోని శాంతినగర్‌లో లోతట్టు ప్రాంతంలో ఉన్న ఇళ్ళలో వరద నీరు చేరింది.
- పాపిరెడ్డికాలనీ, ఆరంభ టౌన్‌షిప్, రాజీవ్‌గృహకల్ప, సుందయ్యనగర్, సురభికాలనీలు నీట మునిగాయి.
- మాదాపూర్‌లో ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుండడంతో 100 ఫీట్ల రోడ్డు మూసి వేశారు
- నెక్టార్ గార్డెన్, పర్వత్‌నగర్, ఎస్‌బిఐ కాలనీ, సిటీ వైన్స్ రోడ్, శిల్పారామం తదితర ప్రాంతాలలో నీరు నిలువకుండా మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద భారీగా వరదనీరు..

- లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.
- దీంతో లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వైపు వెళ్ళాల్సిన వాహనాలను నల్లగండ్ల ఫ్లైఓవర్ మీదుగా మళ్లించడంతో ఇబ్బందులు తప్పాయి.
- అండర్‌బ్రిడ్జి కింద వరదనీటిని నాలాలోకి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- ఈ అండర్‌బ్రిడ్జి పరిస్థితిని బీజేపీ నాయకుల బృందం పరిశీలించింది.

విద్యాసంస్థలకు సెలవు

- ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడం, మరో రెండురోజులపాటు వర్షం కురిసే అవకాశం ఉండడంతో ప్రభుత్వం రెండు రోజుల పాటు సెలవు ప్రకటించడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.





స్కూలుకు సెలవు ప్రకటనతో ఇళ్లకు బయల్దేరిన విద్యార్థులు



మాదాపూర్‌లో 100 ఫీట్ల రోడ్డును మూసివేసిన దృశ్యం



బురదమయంగా తులసీనగర్ రోడ్డు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



శేరిలింగంపల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే గాంధీ



లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి/శేరిలింగంపల్లి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, స్వీయ జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే గాంధీ సూచించారు. గురువారం లింగంపల్లి అండర్ బ్రిడ్జి కింద వరద నీటిని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ఇంటి నుంచి బయటకు రావొద్దన్నారు. కరెంటు స్తంభాలు, విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను తాకవద్దని, మ్యాన్ హోళ్ళు, డ్రైనేజీలను చూసుకొని నడవాలని, చిన్న పిల్లలను ఎట్టి పరిస్థితులలో బయటకు పంపొద్దని ఆయన సూచించారు. లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. అలాగే శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పర్యటించారు. లింగంపల్లి అండర్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు చేరిన ప్రాంతాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు.

విశ్వనగరం కాదు.. ఇదివిషాద నగరం
బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్

హైదరాబాద్‌ను విషాదనగరంగా మార్చారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ విమర్శించారు. లింగంపల్లి అండర్‌బ్రిడ్జిని పరిశీలించిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిన్నపాటి వర్షం కురిసినా లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద వరదనీటితో రాకపోకలు నిలిచిపోవడం 9 ఏళ్ళుగా జరుగుతోందని ఈ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయిందన్నారు .కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, నాయకులు ఎల్లేష్, రమేష్, జగదీష్, శ్రీకాంత్‌యాదవ్, నర్సింహ్మా, మఖన్‌సింగ్ పాల్గొన్నారు. కాగా బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ గజ్జల యోగానంద్ మాట్లాడుతూ ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని, కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామని ప్రకటనలు చేస్తున్నారని, వారు చేసిన అభివృద్ధి వర్షాకాలంలో ప్రతి కాలనీలోని ప్రధాన, అంతర్గత రోడ్ల పరిస్థితి చూస్తే అర్థమవుతుందన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న సామల మహేందర్ రెడ్డి తదితరులు

గచ్చిబౌలి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూటీఎస్ కృషి చేస్తుందని ఆ శాఖ రంగారెడ్డి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం పీఆర్‌టీయుటీఎస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కొండాపూర్ జడ్‌పీహెచ్‌ఎస్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్, ఉపాధ్యాయ బదిలీలు చేపట్టే విధంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ శేరిలింగంపల్లి శాఖ హనుమంతు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అనంతరెడ్డి, శంకర్, పీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య



గచ్చిబౌలి: చెట్టుకు ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జేమ్స్ బాబు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖారవాని,ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన శివకుమార్ కుంటి(21) గౌలిదొడ్డి , కేశవ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మంత్రి అపార్ట్‌మెంట్స్‌లో హౌస్‌కీపింగ్ పనులు చేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడటం, వ్యక్తి గత సమస్యలు ఉండటంతో తీవ్ర మనస్తాపానికి గురై మైహోం క్రిష్ అపార్ట్‌మెంట్ వెనక భాగంలోని నిర్మానుష్య ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకొన్నాడు. గురువారం ఉదయం 8 గంటలకు స్థానికులు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు దుర్మరణం

పటాన్‌చెరు టౌన్: విద్యుత్ షాక్ తగిలి ఓ యువకుడు దుర్మరణం చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఏఎస్‌ఐ గౌస్ కథనం ప్రకారం... పటాన్‌చెరు పట్టణంలోని గౌతమ్‌నగర్ కి చెందిన శంషుద్దీన్(24) ఎలక్ట్రీషియన్. గురువారం కర్దనూర్ గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న భవనంలో కరెంటు పని నిమిత్తం సత్యం రాజు అనే వ్యక్తి శంషుద్దీన్‌ని పిలిపించారు. ఈ క్రమంలో శంషుద్దీన్ పనిచేసే చోట గోడపై నడుచుకుంటూ వెళుతున్న క్రమంలో పైన ఉన్న విద్యుత్ వైర్ తగిలి తీవ్ర గాయాలై అక్కడికక్కడ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతుడు తండ్రి సిరాజుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరానికిగాను గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభ్యర్థులు పీజీ (పోస్ట్ గ్రాడ్యుయేషన్) లో సంబంధిత సబ్జెక్టులో 55% శాతం మార్కులు , ఎస్సీ ఎస్టీ, అభ్యర్థులు 50% శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలని, నెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.గెస్ట్ ఫ్యాకల్టీ ఖాళీల వివరాలు.... ఇంగ్లిష్‌లో-3, కామర్స్ లో-2 , గణితంలో-2 , తెలుగు-1, కంప్యూటర్ అప్లికేషన్/సైన్స్‌లో-5 ,వృక్ష శాస్త్రంలో-1 జంతుశాస్త్రంలో-1 ఖాళీ ఉన్నాయని, గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో 24 వ తేదీ సోమవారం సాయంత్రం నాలుగు గంటల లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.అదేవిధంగా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో 25 వ తేదీ ఉదయం 10 గంటలకు తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంగారెడ్డిలో ఇంటర్వ్యూ (మౌఖిక పరీక్ష)కు హాజరు కావాలన్నారు.

నాలా పరీవాహక ప్రాంతాల పరిశీలన

మియాపూర్: లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులకు సూచించారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తీశ్రీనగర్ వద్ద నాలాలు, నాలా పరీవాహక ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆయన వెంట మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, హఫీజ్‌పేట్ డివిజన్ అధ్యక్షులు గౌతమ్‌గౌడ్ తదితరులున్నారు.

భాషను కాపాడుకోవాలి

- మనూ వీసీ ఐనుల్ హసన్



రాయదుర్గం: భాషా వారసత్వాన్ని రక్షించడంతో బాటు పెంపొందించుకోవాలని మనూ వీసీ ఐనుల్ హసన్ కోరారు.గురువారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మేధావులతో ఆయన సమావేశమయ్యారు. విద్య, భాషా పరిరక్షణ, సామాజిక, విద్య, సమాజాభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఆయన వారితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాంతం, దేశం ఎదుర్కొంటున్న సవాళ్ళను పరిష్కరించడానికి మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం వివిధ రంగాలకు చెందిన పండితులు, రచయితలు, ప్రతినిధులు, నిపుణులతో చర్చించడానికి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ చైర్మన్ డాక్టర్ యూసుఫ్ ముల్లా, విద్యావేత్త డాక్టర్ కెహెచ్ శల్మణి, ఎడ్యుకేషన్ టుడే ఎడిటర్ డాక్టర్ జీషాన్‌అబ్బాస్ రజ్వీ తదితరులు పాల్గొన్నారు.

నెమలి కన్నులు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆచార్య గోనానాయక్, ఆచార్యులు

రాయదుర్గం: హెచ్‌సీయూలో తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్లవెంకటేశ్వరరావు రచించిన నెమలి కన్నులు (ఆత్మకథ మొదటిభాగం) పుస్తకాన్ని గురువారం తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయ ట్రైబల్ అధ్యాపక సంఘం కార్యదర్శి ఆచార్య ఎం గోనానాయక్ ఆవిష్కరించారు.ఎంతోమందికి స్ఫూర్తినిచ్చే ఆచార్య దార్ల ఆత్మకథ అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ కనిపించే కొన్ని బహిర్గతం కాని జీవన సంఘర్షణలు, సంవేదనలను ఆత్మకథల్లో ప్రతిఫలింపచేస్తారని, అటువంటివెన్నో ఆచార్య దార్ల ఆత్మకథలో ప్రతిఫలించాయన్నారు. ఆత్మకథ రాయడమనేది ఒక సాహసంతో కూడిన పని అనీ అటువంటిది దళిత ఆత్మకథ రాయడం మరింత కష్టమైందన్నారు. హెచ్‌సీయూ అధ్యాపక సంఘం పూర్వ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ కవిగా, విమర్శకుడుగా సహ అధ్యాపకులుగా ఉన్న ఆచార్య దార్ల తన ఆత్మకథలో ఒక దళితుడు విశ్వవిద్యాలయ స్థాయిలో ఉన్నతస్థితిలోకి రావడానికి గల నేపథ్యం ఈ ఆత్మకథలో ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ఆచార్యులు పమ్మి పవన్‌కుమార్, డి విజయలక్ష్మీ, డాక్టర్ భూక్యాతిరుపతి, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి, డాక్టర్ డి విజయకుమారి మధుసూదన్, తిరుమల సింగ్ పాల్గొన్నారు.

వంతెన నిర్మించే వరకు పోరాటం

పటాన్‌చెరు టౌన్: వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యం తగదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు.అమీన్‌పూర్- రామచంద్రాపురంను కలిపే వంతెన వద్ద వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో గురువారం స్థానికులు గోదావరి దృష్టికి తీసుకురాగా ఆమె వంతెన దగ్గరికు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి వంతెనపై నీళ్లు పారితే రాకపోకలు నిలిచిపోతాయని, గతంలోనూ ఈ బ్రిడ్జి పై ఓ కారు వరదలో కొట్టుకుపోయి వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే అని అన్నారు. అప్పట్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి వంతెన నిర్మిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వంతెన నిర్మించే వరకు స్థానికులతో కలిసి పోరాటం చేస్తామన్నారు.

22, 23 తేదీల్లో 'ఆకుపచ్చ బాట నడుద్దాం'

పంజగుట్ట: సి.పి.రామస్వామి పర్యావరణ విద్యా కేంద్రం చెన్నై, వైబ్రాంట్ లివింగ్ సహకారంతో ఈ నెల 22, 23వ తేదీల్లో మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో పూర్తి శాకాహార ఉత్సవం 'ఆకుపచ్చ బాట నడుద్దాం' పేరుతో రెండు రోజుల ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు పర్యావరణ విద్యా కేంద్రం చెన్నై డైరెక్టర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కేంద్రం హైదరాబాద్ ఇన్‌చార్జి, సీనియర్ పాత్రికేయులు వెంకటరత్నంతో కలిసి కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం మనం సేవిస్తున్న పాలలో ఉన్న 59 రకాల హార్మోన్లు మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. పాలు ఎక్కువగా ఇచ్చేందుకు పశువులకు ఇచ్చే ఇంజక్షన్ల వల్ల కూడా ఎన్నో అపాయాలు ఉన్నాయన్నారు. రెండు రోజుల ప్రదర్శనలో పాలకు ప్రత్యామ్నాయంగా మంచి ప్రొటీన్లు ఉన్న ఆకుకూరలు, కాయధాన్యాలు, చిక్కుళ్లు, ఆకుపచ్చ సహజ ఉత్పత్తులైన సోయా, సోయా బీన్స్, పుట్టగొడుగులు, ప్రత్యామ్నాయ వృక్ష సంబంధిత కొబ్బరిపాలు, బాదంపాలు, వేరుసెనగ పాలు తదితర 20 రకాల స్టాల్స్ ఉంటాయన్నారు. ఎవరైనా రావొచ్చని ప్రవేశం పూర్తిగా ఉచితమన్నారు.